
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శనివారం 6 సెప్టెంబరు 2025



ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువులో గణనాథుడి నిమజ్జనం



ధారూర్: మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



పెద్దేముల్: ముంబాపూర్‌లో..

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకొని జిల్లాలో మిలాద్ ఉన్ నబీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు నిర్వహిస్తూ ప్రవక్తను స్మరించుకున్నారు. పెద్దేముల్ మండలంలో ముంబాపూర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ధారూర్ జామ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



చించల్‌పేట్ గ్రామంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

జై గణేశా..

గణేశ్ నవరాత్రోత్సవాలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పలు చోట్ల శుక్రవారం వినాయకులను నిమజ్జనం చేశారు. కాగా, గణపయ్య లడ్డూ కోసం పోటాపోటీగా వేలం పాడారు. అనంతరం వైభవంగా శోభాయాత్ర నిర్వహిస్తూ వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



పోచారంలో రూ.1.85 లక్షలకు లడ్డూను దక్కించుకున్న విష్ణు గౌడ్



నియామక పత్రం అందజేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

జీపీవోలకు నియామక పత్రాలు అందజేత

వికారాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామ పాలన అధికారులు(జీపీవో) శుక్రవారం నియామక పత్రాలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆధ్వర్యంలో 139 మంది జీపీవోలు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలువురికి నియామక పత్రాలు పంపిణీ చేసిన తర్వాత జిల్లాకు చెందినవారికి అదనపు కలెక్టర్ నియామక ప్రతాలు అందజేశారు. జిల్లాకు మొత్తం 163 మంది జీపీవోలను కేటాయించగా, వారిలో జిల్లాకు చెందిన 139 మందికి నియామకపత్రాలు అందజేయగా, ఇతర జిల్లాల నుంచి జిల్లాకు కేటాయించిన జీపీవోలు అక్కడి అధికారుల నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. జిల్లాకు కేటాయించిన 163 మంది జీపీవోలు శనివారం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయనున్నారు. ఎవరిని ఏ క్లస్టర్‌కు కేటాయించే విషయమై జీపీవోల నుంచి అధికారులు ఆప్షన్లు తీసుకుని ఆ తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

ఐసీడీఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వ కుట్ర

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

7

పరిషత్ పోరుకు సన్నద్ధం

న్యాయస్థానం ఆదేశానుసారం ఈ నెలాఖరు నాటికి స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఏర్పాట్లు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నేడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల చేయనున్నారు. ఇంతకు ముందే పంచాయతీలకు సంబంధించిన ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు

- నేడు ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల
- 10వ తేదీన తుది జాబితా ప్రకటన
- ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పత్రాలు సిద్ధం
- దాదాపు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బీసీ రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పరిషత్ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా అధికారులు నేడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదాను విడుదల చేయనున్నారు. అలాగే నేటి నుంచి 8వ తేదీ వరకు వీటికి సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 8న జిల్లా స్థాయిలో కలెక్టర్లు స్థానిక రాజకీయ నేతలతో సమావేశాలను నిర్వహించనున్నారు. అదే సమయంలో ఎంపీడీఓలు మండల స్థాయిలో స్థానిక రాజకీయ నేతలతో సమావేశాలు నిర్వహించి వారి నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించనున్నారు. 10వ తేదీన ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాలు విడుదల

మిగతా 7వ పేజీలో...

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు

జిల్లా	జెడ్పీటీసీ	ఎంపీటీసీ
రంగారెడ్డి	21	230
వికారాబాద్	20	227

6వ తేదీ	ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటన
8వ తేదీ	రాజకీయ పార్టీలతో అధికారుల సమావేశాలు
6నుంచి 8వరకు	అభ్యంతరాలు, వినతులు స్వీకరణ
9న	అభ్యంతరాలు, వినతులు పరిశీలన, పరిష్కారం
10న	ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటన

బీసీ రిజర్వేషన్లపై వీడని సందిగ్ధత

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 42శాతం అమలు చేసే విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తరువాతనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో దీనిపై బిల్లు ప్రవేశపెట్టింది. బీసీ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం లభించడంతో ఆ బిల్లును గవర్నర్‌కు పంపారు. ఈ బిల్లును ఆమోదించాలంటూ ఇటీవల అఖిలపక్ష నేతలు కూడా గవర్నర్‌ను కలిశారు. అయితే ఇది గవర్నర్ వద్ద ఇంకా పెండింగ్ ఉండడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. గవర్నర్ నిర్ణయం వ్యతిరేకంగా వస్తే ఎం చేయాలి? అనేదానిపై ప్రభుత్వం ఇంకా తర్జనభర్జనలు పడుతున్నట్లు సమాచారం.

గురువులే సమాజ నిర్మాతలు

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ పక్కన చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

వికారాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, విద్యార్థుల భవిష్యత్తును మలుపు తిప్పేది కూడా గురువులేనని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదేనని అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఏడాదిలోగా సంక్షోభాన్ని అధిగమించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు రావడానికి పగలు, రాత్రి కష్టపడుతున్న ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు తరాలు బాగుండాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు అధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే మొదటిసారిగా విద్యా కమిషన్ నియమించిందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించిన ఆయన ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో వికారాబాద్ జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా కష్టపడాలని ఆయన కోరారు.

ఉన్నతస్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలి

చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాల్సింది ఉపాధ్యాయులేనన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి, ఉపాధ్యాయులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పు ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించినఅర్పించారు. అనంతరం జిల్లాలో ఎంపిక చేసిన 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. డీఈవో రేణుకాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు కడియాల చంద్రశేఖర్, అమర్‌నాథ్, వెంకటరత్నం, అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుదర్శన్, షఫి, వేణుగోపాల్, తిమ్యానాయక్, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

చెరువుల వద్ద క్రేన్లు, లైట్లు, వైద్య శిబిరాల ఏర్పాటు



శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 17 చెరువుల గుర్తింపు
- వికారాబాద్ జిల్లాలో నిమజ్జనం చేయనున్న 665 ప్రతిమలు
- వేడుకలకు హాజరు కానున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మేడ్చల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్: నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకున్న గణనాథులను శనివారం గంగమ్మ చెంతకు చేర్చేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అన్ని చెరువుల వద్ద నిమజ్జనాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. వినాయక నిమజ్జనానికి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా నిమజ్జనానికి

మిగతా 8వ పేజీలో...

పరిగి సబ్ డివిజన్ పరిధిలో 415 విగ్రహాలు..

వికారాబాద్ జిల్లాలో నేడు మొత్తం 665 విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 215, పరిగి సబ్ డివిజన్ పరిధిలో 415, తాండూరు పరిధిలో 35చొప్పున విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. 800 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే వికారాబాద్ పట్టణంలోని గణనాథులను ముందుగా కొత్తగంజ్‌లోకి తీసుకొచ్చి అక్కడి నుంచి ఎబ్బనూర్ చెరువుకు తరలించి అక్కడ నిమజ్జనం చేయనున్నారు. అక్కడ మున్సిపల్ అధికారులు రెండు క్రేన్లు ఏర్పాటు చేశారు. అలాగే వినాయకులను స్వాగతించేందుకు పట్టణంలో స్టేజీలు ఏర్పాటు చేశారు. ఈ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.



అవార్డు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

శామీర్‌పేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని అలంకృత రిసార్ట్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఉరుకులు పరుగులతో శ్రమిస్తున్న వారికి యోగాతో ఏకాగ్రతతో పాటు ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం బోధి స్కూల్ ఆఫ్ యోగా జాతీయ స్థాయి అవార్డులను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది అతిథులు తరలి వచ్చారు. వారందరికీ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో మిస్ ఇండియా రష్మిక, ఆధ్యాత్మిక వేత్త గౌరీ రొక్కం, సత్యవాణి, బోధి యోగా స్కూల్ ఫౌండర్ అశోక్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు గ్రహణం!

- పనులను మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్లు
- ప్రారంభానికి నోచుకోని మరికొన్ని రోడ్ల మరమ్మతులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- ఇష్టారాజ్యంగా గుత్తేదార్ల తీరు
- 'తాండూరు'లో నత్తనడకన రూ.300 కోట్ల విలువైన రోడ్ల పనులు

తాండూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలతో చేపట్టాల్సిన బీటీ రోడ్డు పనులకు గ్రహణం పట్టింది. సుమారు రూ.300 కోట్లకు పైగా విలువైన రోడ్డు పనులను కాంట్రాక్టర్లు కొన్నింటిని ప్రారంభించి మధ్యలో వదిలేశారు. మరికొన్ని పనులు అగ్రిమెంట్ గడువు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభించడం లేదు. ప్రారంభించిన పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లు అధ్వానంగా ఉండటంతో తాండూరు నియోజకవర్గ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. తాండూరు నుంచి నిత్యం వందలాది లారీల్లో నాపరాయి, సిమెంట్, సుద్ద, ఎర్రమట్టిని తరలిస్తుంటారు. కానీ రోడ్లు గుంతలమయంగా

మిగతా 8వ పేజీలో...

నిధులున్నా ముందుకు సాగని పనులు



కంకర వేసి వదిలేసిన తాండూరు - వికారాబాద్ రోడ్డు



అధ్వానంగా జినుగుర్తి - తట్టేపల్లి రోడ్డు

ఆ ముగ్గురు కాంట్రాక్టర్లదే హవా

వికారాబాద్ జిల్లాలో ముగ్గురు కాంట్రాక్టర్లదే హవా కొనసాగుతోంది. ఏ ప్రభుత్వం ఉన్న వారే టెండర్లలో పాల్గొని పనులు దక్కించుకుంటారు. పొందిన పనులను మాత్రం పూర్తి చేయరు. కొత్త వారిని రానివ్వరు. ఇటీవల అదే సామాజిక వర్గానికి ఇద్దరు కొత్త కాంట్రాక్టర్లు కొన్ని పనులను దక్కించుకున్నారు. వారు కూడా ఇదే బాటలో ప్రయణిస్తున్నారు. ఇటీవల తాండూరు- కొడంగల్ మార్గంలోని కొత్త వంతెనపైన కూడ రంధ్రం పడే విధంగా నాణ్యత లోపించిన పనులు చేపట్టారు. అధికారులు సదరు కాంట్రాక్టర్లను గట్టిగా హెచ్చరించ లేకపోతున్నారు. అగ్రిమెంట్ గడువు పూర్తి అయినా వారికి నోటీసులు కూడా ఇవ్వని పరిస్థితి. మహేందర్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో రోహిత్‌రెడ్డి చేతిలో ఓటమి పాలుకావడం ప్రధానంగా తాండూరు రోడ్ల అధ్వానమే కారణమని చెప్పొచ్చు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సైతం అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

సామాన్యులకు ఊరట కలిగేలా జీఎస్టీ మార్పు

వికారాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో దీంతో రైతులకు వ్యవసాయ పరికరాలు తక్కువ ధరలకు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మాధవి, విజయ్‌కుమార్, పెంటయ్య, శివరాజ్, సాయిరెడ్డి గౌతపూర్, ఎర్రోళ్ల లక్ష్మయ్య, హన్మంత్ రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఫొటోఎక్స్‌పోను విజయవంతం చేయాలి

మంచాల, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నార్సింగ్‌లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరిగే ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల మల్లేష్ ఫొటోగ్రాఫర్లకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మంచాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదగిరి, రఘునాయక్, భాస్కర్, సురేందర్, మహేష్, సతీష్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ కలెక్టరేట్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్పీకర్, చీఫ్‌విప్, ఎమ్మెల్యే, అధికారులు



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వికారాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందిస్తున్న కొత్తగడి జడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ఎ.వీరకాంతం, శివారెడ్డిపేట ఫిజికల్ డైరెక్టర్ డి.ప్రతాప్‌రెడ్డిలను జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడియాల చంద్రశేఖర్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్ ఎంపికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బొంరాస్‌పేట్: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా బొంరాస్‌పేట్ జడ్పీహెచ్‌ఎస్ భవానీ, చౌదర్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ ఆనంద్, రేగడిమైలారం జడ్పీహెచ్‌ఎస్ శంకరయ్య, బొట్లవనితండా టీడబ్ల్యూఏఎస్ సురేశ్, యంపీపీఎస్ లింగన్‌పల్లి ఆమూల్య, యంపీపీఎస్ బురాన్‌పూర్ ఎండీ.అలీమోద్దీన్, యంపీపీఎస్ రేగడిమైలారం శ్రీదేవి, యంపీపీఎస్ బొట్లవనితండా స్రవంతి, యంపీపీఎస్ తుంకిమెట్ల రజిత, యంపీపీఎస్ బురాన్‌పూర్ విజయలక్ష్మిలు ఎంపికయ్యారు.

బషీరాబాద్: మండలంలో జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు విద్యాధికారి దూసరాములు తెలిపారు. జిల్లా స్థాయికి బాలమణి, జెడ్పీహెచ్‌ఎస్ రెడ్డిఘణాపూర్, అస్రానాజ్ పీజీటీ తెలంగాణ మోడల్ స్కూల్, బెస్ట్ మెంటర్ అవార్డుకు పార్వతిదేవి జడ్పీహెచ్‌ఎస్ గొట్టిగఖుర్దు ఎంపికయ్యారు. వారితో పాటు మండల ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు(శనివారం)తాండూరులోని వినాయక కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతులమీదుగా అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

యాలాల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌వో మంగమ్మ, ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

పూడూరు: మండలం నుంచి ఐదుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. హిందీ ఉపాధ్యాయుడు కృష్ణయ్య(చెన్‌గోముల్ జెడ్పీహెచ్‌ఎస్), సోషల్ ఉపాధ్యాయుడు వెంకటయ్య(మన్నెగూడ జెడ్పీహెచ్), కంకల్, పూడూరు ఎంపీపీఎస్ ఎస్జీటీలు ఈశ్వర్‌రావు, సంతోషమ్మ, మన్నెగూడ ఉర్దూమీడియం ఎంపీపీఎస్‌కు చెందిన ఎస్జీటీ అఫ్రాత్ సుల్తానా పురస్కారాలు అందుకున్నారు.

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రేణుక జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు. జిల్లా కేంద్రంలో డీఈవో రేణుకాదేవి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఎంఈవో వెంకటస్వామి, ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు రేణుకను అభినందించారు.



యాలాల: కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉపాధ్యాయునిలకు సన్మానం



పూడూరు: అవార్డుతో ఈశ్వర్‌రావు



దౌల్తాబాద్: డీఈవో రేణుకాదేవి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు రేణుక

40 ఏళ్లుగా ఊరికొక్కటే గణనాథుడు

ఆదర్శంగా లింగారెడ్డిగూడ

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గల్లి, గల్లికో రెండు మూడు గణనాథులను ప్రతిష్ఠిస్తున్న ప్రస్తుత రోజుల్లో 40 ఏళ్లుగా ఊరికి ఒకటే గణనాథుడిని ప్రతిష్ఠించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామస్తులు. ఈ గ్రామం నుంచి ఇద్దరు బీశ్వ కిష్టయ్య, బక్కని నర్సింహులు ఎమ్మెల్యేలుగా గెలువగా, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఫరూఖ్‌నగర్ మండలానికి ఎంపీపీగా పని చేశారు. గ్రామంలో అన్ని రాజకీయ పార్టీలు ఉన్నా వినాయక చవితి పండుగకు మాత్రం అందరూ ఒక్కటై ఒకే గణనాథుడిని ప్రతిష్ఠిస్తారు. మొదట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడు అందరి గణపయ్యగా మారాడు. ఊరంతా భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. విశేషమేమంటే మైకులు, డీజేలు పెట్టరు. కేవలం భజనలు మాత్రమే చేస్తారు. ఇలాంటి సంప్రదాయం అన్ని గ్రామాలు పాటిస్తే ఎంతో బాగుంటుంది కదూ.



గణనాథుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతికి మేలు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల ఉత్పత్తుల నుంచి ఆటో మొబైల్స్ వరకు జీఎస్టీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని ఎంఆర్‌పీ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వారికి చాలా ఉపయోగపడుతుందన్నారు. సెన్సార్ బోర్డు మెంబర్ బస్వలింగం, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి, విజయరాజ్, బుచ్చిరెడ్డి, గోపాల్, శ్రీశైలం, యాదగిరి పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు



మోమిన్‌పేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామ విరాట్ హనుమాన్ వాగు కల్వర్టు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రైతులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులో గల జదిగల కల్వర్టు రోడ్డు వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి చెందిన దాదాపు 60 మంది రైతులు గంగారం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా కల్వర్టు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న బాబర్‌ఖాన్

అభివృద్ధిపై ప్రశ్నిస్తే తప్పా?

షాద్‌నగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిపై తమ ఎమ్మెల్యే ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆస్తుల గురించి మాట్లాడటం సహేతుకం కాదని కాంగ్రెస్ నేతలు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ వైస్ ఛైర్మెన్, సీనియర్ నాయకులు రఘు నాయక్ మాట్లాడుతూ ఇటీవల షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఆస్తుల విషయంలో విచారణ జరిపించాలని ఎందుకు కోరారో అర్థం కావడం లేదన్నారు. తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై కవిత చెప్పిన విషయాలపైనే మీడియాతో మాట్లాడారని, మాజీ ఎమ్మెల్యే ఆస్తుల గురించి ఎలాంటి ప్రస్తావన తేలేదన్నారు. నియోజకవర్గంలో తన ఉనికిని కాపాడుకోవడానికే మీడియా ముందుకు వచ్చారని ఎద్దేవా చేశారు. నాయకులు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూరు బస్వం, పురుషోత్తమ్‌రెడ్డి, గోవర్ధన్ గౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీని అంగన్‌వాడీకి అప్పగించాలి

తాండూరు రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప కోరారు. శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు అప్పగించాలన్నారు. పీఎం విద్యా సెంటర్ల కోసం ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు కొత్తవారికి నిర్వహించనున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐసీడీఎస్ తాండూరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి, బేబి జయంతి, రామంజమ్మ, భాగ్యలక్ష్మి మణిమాల, విజయలక్ష్మి, సంధ్యలలిత, వసంత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హైదరాబాద్‌కు తరలిన జీపీవోలు

వికారాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్న గ్రామపాలన అధికారుల కోసం వికారాబాద్ జిల్లా నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ జెండా ఊపి మూడు బస్సులను ప్రారంభించారు. మొత్తం 139 మంది ఎంపికైన అభ్యర్థులు, నోడల్ అధికారులు, పోలీస్ సిబ్బందితో కలిసి మాదాపూర్‌లోని హైటెక్స్‌కు బయలుదేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌వో మగ్లీలాల్, ఏఓ పర్హీన బేగం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

నేలకొరిగిన భారీ వృక్షం



కందుకూరు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామంలో వందల ఏళ్ల నాటి రావిచెట్టు శుక్రవారం మధ్యాహ్నం కూలిపోయింది. ఎలాంటి ఈదురు గాలులు, వర్షం లేకున్నా చెట్టు మొదటి భాగం విరిగి నేలకొరిగింది. గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న ఈ చెట్టుకు ప్రజలు పూజలు చేసేవారు. చెట్టు కూలిన విషయం తెలుసుకొని గ్రామస్తులంతా అక్కడి చేరుకొని విస్మయం వ్యక్తం చేశారు. చెట్టు కూలి దేవాలయం గోడలపై పడిన ఎలాంటి అపాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

ఇష్టారాజ్యంగా మైనింగ్ దందా

దోమ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుపల్లి తండా నుంచి పోతిరెడ్డిపల్లి తండాకు వెళ్లే బీటీ రోడ్డు మార్గంలో మైనింగ్ వ్యాపారులు ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతుండటంతో రహదారి దెబ్బతింటుందని ప్రజలు వాపోతున్నారు. ఆ మార్గంలో రాత్రి వేళల్లో మట్టిని టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు దెబ్బతింటుందని గిరిజనులు ఆరోపించారు. శుక్రవారం గోర్ బంజార హక్కుల సాధన సమితి నాయకులు దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట మున్సిపాలిటీ డబీల్‌పూర్ పరిధిలోని భారత్ బైబిల్ కళాశాలలో అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత్ బైబిల్ కాలేజ్, నాజిరీన్ గ్రామర్ హైస్కూల్ సభ్యులు జేడీ మోజస్, శ్యాం బుర్రా, జాకబ్ చిన్నప్ప ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సొసైటీ సమావేశంలో సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భారత్ బైబిల్ కళాశాలలో అక్రమాలకు పాల్పడిన మాజీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ మేరకు కళాశాలలో చేసిన అక్రమాలకు సంబంధించి కమిటీ షోకాస్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. కళాశాలలో అక్రమాలకు పాల్పడుతూ ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించిన సదరు మాజీ డైరెక్టర్‌ను పదవి నుంచి తొలగించినప్పటికీ కళాశాలలో తిరిగి ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మాజీ డైరెక్టర్ కొంత మందిని తీసుకొచ్చి కళాశాలలో గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రైతుల పక్షపాతి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిలబెట్టుకున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోవిందరావుపేటలో కొత్తగా మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను యాలాల సొసైటీ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బాల్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. గోవిందరావుపేట సమీపంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్లు సమకూర్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమప్ప, అనిల్‌కుమార్, హన్మంతు, అక్బర్ బాబా, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నర్సింహులు, హైమద్, తదితరులున్నారు.

అట్టహాసంగా ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

నందిగామ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిసాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, అండమాన్‌నికోబార్ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. శుక్రవారం చివరి రోజు జరిగిన పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఇక్ఫాయి కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇక్ఫాయి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని గ్రేటర్ హైదరాబాదు బీఆర్‌ఎస్వీ సెక్రటరీ రహమత్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాల ఎదుట శుక్రవారం బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు ధర్నా చేశారు. కళాశాల యాజమాన్యానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇక్ఫాయి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆరోపించారు. కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇక్ఫాయి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ ఓయూ ఇన్‌చార్జి శ్రీకాంత్ ముదిరాజ్, బీఆర్‌ఎస్వీ ఓయూ నాయకులు నాగేందర్‌రావు, దయాకర్, ఆసిఫ్, రాకేష్, ఆఫ్రిద్, విజయ్, రవికుమార్ ఉన్నారు.

భర్తను బండరాయితో కొట్టిచంపిన భార్య

కోట్‌పల్లి మండలం రాంపూర్‌లో ఘటన


రాంచంద్రయ్య (ఫైల్)

కోట్‌పల్లి సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి భర్తను బండరాయితో కొట్టిచంపింది ఓ భార్య... ఈ సంఘటన శుక్రవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శైలజ తెలిపిన వివరాలిలా ఉన్నాయి..రాంపూర్ గ్రామానికి చెందిన బి.రాంచంద్రయ్య (44) సుజాత దంపతులకు 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రాంచంద్రయ్య వ్యవసాయంతో పాటు స్థానిక గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా సుజాత వేరే ప్రాంతానికి వెళ్లి బతుకుదాం... అంటూ భర్తతో తరచూ గొడవపడేది. ఇందుకు రాంచంద్రయ్య ఒప్పుకోకపోవడంతో భర్తను అడ్డుతొలగించాలని పథకం వేసింది. భర్త గురువారం రాత్రి ఇంటి ముందు పడుకున్నాడు. సుజాత పెద్ద బండరాయితో అర్ధరాత్రి వేళ కొట్టిచంపింది. తల ఇతర అవయవాల పై తీవ్రంగా గాయపర్చి హత్య చేసింది. మృతుడి సోదరుడు అంజయ్య ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,ధారూరు సీఐ రఘురాములు ఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించారు. మృతదేహానికి మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని శైలజ తెలిపారు..

ఐసీడీఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వ కుట్ర

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య


నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

కొడంగల్ రూరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీ ప్రైమరీ విద్య పేరుతో ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య ఆరోపించారు. శుక్రవారం కొడంగల్‌లోని కడా కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లల బాధ్యతను ఐసీడీఎస్ నిర్వహించేదని ఇప్పుడు తీసుకవస్తున్న జాతీయ విద్యా విధానంతో ఎన్ఈపీలోకి రాష్ట్ర ప్రభుత్వం మార్చిందన్నారు. ఈ విద్యా విధానం అమలు చేస్తున్న సందర్భంలో అంగన్‌వాడీ టీచర్స్, కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలలో కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, విద్యా బోధన బాధ్యతలను అంగన్‌వాడీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్యా వలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని వీరికి అదనంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, అరుణ, జీవనజ్యోతి, నర్సింగమ్మ, పద్మ, చంద్రకళ, యాదమ్మ, విజయలక్ష్మితో పాటు ఆయా మండలాల టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆఫీస్ సబార్డినేట్‌కు వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి



ఆమనగల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎండీ అప్సర్‌కు పదోన్నతి లభించింది. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి పశు వైద్యశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న అప్సర్‌కు వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. కందుకూరు పశు వైద్యశాలకు పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జేడీ మధుసూదన్ చేతులమీదుగా పదోన్నతి పత్రాన్ని అందుకున్నారు. ఆయనను గట్టిప్పలపల్లి పశు వైద్యశాల సిబ్బంది అభినందించారు.

మీర్‌ఖాన్‌పేట టు యాచారం

66 ఫీట్ల రహదారికి ప్రణాళిక!

వరుస కథనాలకు కదిలిన యంత్రాంగం


రెండున్నర సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాచారం, కందుకూరు మండలాలను కలిపే ఆర్ అండ్‌బీ రహదారి రెండున్నరేళ్లగా అసంపూర్తిగా ఉండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డును మట్టిరోడ్డుగా మార్చి వదిలేయడంతో జనం పడుతున్న బాధలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో పార్నా రోడ్డుకు మోక్షమెప్పుడో!, రోడ్ల మరమ్మతు సంగతేంటి?, రోడ్ల పనులు పూర్తయ్యేదెన్నడు? మరమ్మతుకు నోచని రోడ్డు, నిధుల కొరత, రహదారుల విస్తరణకు బ్రేక్! దారికొచ్చేనా? అంటూ ప్రచురితమైన వరుస కథనాలతో రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందించారు. రహదారిని త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ శాఖ ఈఎన్‌సీతో సమావేశమయ్యారు. ఇటీవల మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు రోడ్డు దుస్థితి, జనాల ఇబ్బందులను వివరించారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రహదారి నిర్మాణానికి చర్యలు

ఈ క్రమంలో రహదారి నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ ఈఈ రమేష్ ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారిని 66 ఫీట్లకే పరిమితం చేస్తున్నట్లు చెప్పారు. నందివనపర్తి, నక్కర్తిసింగారం, మొగ్గుళ్లవంపు, యాచారం గ్రామాల్లో పాత రహదారిని కాస్త వెడల్పు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో రహదారి విస్తరణపై తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. అయితే గ్రామాల్లో 33ఫీట్ల రహదారి వేయాలా, 66ఫీట్ల రహదారి వేయాలా సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో రూ.78 కోట్ల నిధులు కేటాయించారని, నేడు ఆ నిధులు సరిపోవని, మరిన్ని నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. రహదారి నిర్మాణానికి మరోమారు సర్వే చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు డివైడర్ వేసే అంశంపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డివైడర్ వేస్తే బాగుంటుందని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.


షాద్‌నగర్ అర్బన్: రూ.12 లక్షలకు లడ్డూ దక్కించుకున్న అభిషిత్‌రెడ్డి


లడ్డును దక్కించుకున్న బాకారం మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి

పోటాపోటీగా గణేశ్ లడ్డూల వేలం

- ఉత్కంఠ భరితంగా సాగిన ఆక్షన్
- షాద్‌నగర్‌లో రూ.12 లక్షలు, చేవెళ్లలో రూ.10 లక్షలు పలికిన వినాయక లడ్డూ ప్రసాదం
- ఏజీ విల్లాస్ లడ్డూ రూ.7,77,777
- కనుల పండువగా శోభాయాత్రలు


షాద్‌నగర్ అర్బన్: రూ.7.77 లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్న ఉప్పల శివ

కడ్తాల/షాద్‌నగర్ అర్బన్/ చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/ఘట్‌కేసర్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణనాథుల నిమజ్జనం నేపథ్యంలో వినాయక లడ్డూల వేలం పాటలు పోటా పోటీగా కొనసాగాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని చేవెళ్ల రెడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కవాడి తిరుపతిరెడ్డి, జుకన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, కనకమామిడి శ్రీరామ్‌రెడ్డి ఉమ్మడిగా వినాయక లడ్డూను రూ.16 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే షాద్‌నగర్ పరిధిలోని ఫరూక్‌నగర్ మండలం మధురాపురం గ్రామ రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో వినాయక లడ్డూను అదే గ్రామానికి చెందిన అభిషిత్‌రెడ్డి రూ.12 లక్షలకు దక్కించుకున్నారు. మొయినాబాద్ మండలం బాకారం జాగీర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో లడ్డూ ప్రసాదాన్ని గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి రూ.10 లక్షలకు కైవసం చేసుకున్నాడు. షాద్‌నగర్ పట్టణంలో ఏజీ విల్లాస్‌లో నెలకొల్పిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం అర్ధరాత్రి పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో ఏజీ విల్లాస్ నివాసి ఉప్పల శివ 7,77,777 రూపాయలకు దక్కించుకున్నారు. రెండవ లడ్డూను అదే కాలనీకి చెందిన సోలిపూర్ రాజశేఖర్‌రెడ్డి రెండు లక్షలకు కైవసం చేసుకున్నారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో వినాయక మండపాల వద్ద శుక్రవారం నిమజ్జనం నేపథ్యంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. మైసిగండి గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన పెద్ద వినాయకుడి మండపం వద్ద వినాయక లడ్డూను రూ.3.01 లక్షలకు కేతావత్ సుమాన్ నాయక్ సొంతం చేసుకున్నారు. మైసమ్మ గుడి వద్ద గండి మైసమ్మ వినాయక మండపం లడ్డూను రూ1.42 లక్షలకు కేతావత్ సునిల్‌నాయక్, హనుమాన్‌గుడి వద్ద లడ్డూను రూ.1.55 లక్షలకు అమృనాయక్, ఎల్లమ్మ తండా ఉత్సవ కమిటీ లడ్డూను రూ. 63 వేలకు రామావత్ పత్యనాయక్, పొదుశ్రీ వినాయక ఉత్సవ కమిటీ లడ్డూను రూ.1.33 లక్షలకు చరణ్ నాయక్, కానుబా వినాయక ఉత్సవ కమిటీ లడ్డూ రూ.1.55 లక్షలకు రామావత్ రాజు నాయక్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూ దక్కించుకున్న వారిని మండపాల నిర్వాహకులు సత్కరించారు. అనంతరం మండపాల వద్ద ఉట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వినాయకుల భారీ ఊరేగింపుతో స్థానిక చెరువులో గణపయ్యను నిమజ్జనం చేశారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని రజనగర్ కాలనీ వినాయకుడి లడ్డూను రూ. 3.50లక్షలకు మిత్రసేనా సభ్యులు కైవసం చేసుకున్నారు. మల్లికార్జున కాలనీ లడ్డూ రూ. 2.65లక్షలకు శేఖర్ యాదవ్ గ్రూప్ సభ్యులు దక్కించుకున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ లడ్డూ రూ. 3 లక్షలకు సాయి తీసుకున్నారు. అలాగే అంబేడ్కర్ కాలనీ వినాయకుడి లడ్డూ రూ. 1.50లక్షలకు రామకృష్ణ, మరో లడ్డూ దుర్గప్రసాద్ రూ.లక్షకు దక్కించుకున్నారు. భగత్‌సింగ్ కాలనీ లడ్డూ రూ.1.12లక్షలకు బి.నర్సింలు కైవసం చేసుకున్నారు. అలాగే మండలంలోని గుండాల గ్రామంలోని వినాయకుడి లడ్డూ రూ. జయశ్రీ రవీందర్‌రెడ్డి దంపతులు రూ. 2.5లక్షలకు దక్కించుకున్నారు. కోటాలగూడ గ్రామంలోని వినాయకుడి లడ్డూ రూ. 2.11లక్షలకు ఎర్ర మహేందర్‌యాదవ్ దక్కించుకున్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో హనుమాన్ మందిర్ వినాయక లడ్డూను రూ.2లక్షల 55 వేలకు మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్ కైవసం చేసుకున్నారు.

ఘట్‌కేసర్‌లో..

పోచారం మున్సిపాలిటీ పరిధిలో వినాయక నిమజ్జనాలు జోరుగా సాగుతున్నాయి. ఘట్‌కేసర్‌లోని ఆర్‌కే శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని లడ్డూను గడ్డం సుభాష్ అనే వ్యక్తి రూ.2.50 లక్షలకు దక్కించుకున్నాడు. పోచారంలోని సుభాష్ చంద్రబోస్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి లడ్డూను చెరుకు విష్ణుగౌడ్ రూ. 1.85లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నాడు.

పేదలకు భరోసాగా ప్రభుత్వం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసాగా ప్రభుత్వం నిలుస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శుక్రవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రగతి ఏమీ లేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 20 నెలల్లోనే అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు భట్టు కిషన్ రెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, గుర్రం కేశవులు, అనంతరెడ్డి, వెంకట్‌నారాయణరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, సూదిని కొండల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, జగన్, సురేందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు 78 సీఎంఆర్‌ఎఫ్, 16 కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, నాయకులు ఎర్రవల్లి జాఫర్, పాల్గొన్నారు. అలాగే వికారాబాద్ మండలంలోని కామారెడ్డిగూడ, పులుసుమామిడి గ్రామాల్లో బాధిత కుటుంబాలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ పరామర్శించారు. కామారెడ్డిగూడలో భర్త చేతిలో దారుణహత్యకు గురైన స్వాతి కుటుంబ సభ్యులను కలిసిన ఆయన ఘటనపై వివరాలు తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పులుసుమామిడి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు శివ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న తొమ్మిదిరేకుల రైతులు

పాత అలైన్‌మెంట్ ప్రకారం ట్రిపుల్ ఆర్ నిర్మించాలి

కేశంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్‌ను పాత అలైన్‌మెంట్‌లో నిర్మించాలని కోరుతూ మండలంలోని తొమ్మిదిరేకుల, నిర్దవెల్లి గ్రామాల రైతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేని కలిశారు. రెండు గ్రామాల మధ్య 70 సర్వే నంబర్ల మీదుగా ట్రిపుల్ ఆర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటన విడుదల చేసిందని, దీంతో చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిని దెబ్బతింటుందని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే... రైతుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, నాయకులు బీసా కురుణాకర్ రెడ్డి, నరసింహా రెడ్డి, వెంకట్ రెడ్డి, బడక మల్లయ్య, గుత్తి రంగయ్య, భీమయ్య, రాజేందర్, శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.


కొందుర్గు: యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు

కొందుర్గు/చౌడాపూర్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి తిప్పించుకుంటూ రెండు బస్తాల యూరియా ఇస్తున్నారని ఆగ్రహించిన రైతులు శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు సముదాయించి పంపించారు. అలాగే చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు.


చౌడాపూర్: మరికల్‌లో..

పరిషత్ పోరుకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

చేస్తారు. మరో వైపు ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బంది నియామకాలు కూడా దాదాపు పూర్తయ్యాయి. ఎన్నికల విధుల కోసం అవసరమైన సిబ్బందితో పాటు అదనంగా మరో పదిశాతం సిబ్బందిని నియమిస్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం కీలకమైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో), సహాయ అధికారుల (ఏఆర్వో)ను నియమించింది. ఒక్కో జెడ్పీటీసీ స్థానానికి ఒక్కో రిటర్నింగ్ అధికారిని నియమించారు. మూడు ఎంపీటీసీ స్థానాలకు ఒక సహాయ అధికారి చొప్పున నియమించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, ఐదుగురు సిబ్బందిని నియమిస్తున్నారు. ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించిన కసరత్తు కూడా తుది దశకు చేరుకుంది.

దాదాపు ఏర్పాట్లు పూర్తి

స్థానిక ఎన్నికలకు న్యాయస్థానం ఇచ్చిన గడువు దగ్గరపడుతుండడంతో అధికారులు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తిచేశామని ఈనెల 10వ తేదీ నాటికి మిగతా ప్రక్రియ కూడా పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఇప్పటికే ప్రకటించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు బ్యాలెట్ బాక్సులు కూడా అధికారులు సిద్ధం చేశారు. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు గుర్తులు కూడా ఖరారు చేశారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి 30 గుర్తులు ఖరారు చేయగా, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఖరారు చేశారు. సర్పంచ్ పోలింగ్‌కు పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుల ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. జిల్లా పరిషత్ ఎన్నికలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులతో పాటు స్వతంత్ర అభ్యర్థుల కోసం మరికొన్ని గుర్తులు రెడీ చేశారు.

పాఠశాలకు అపూర్వవైభవం



ఎల్లమ్మతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు


చదువుకుంటున్న చిన్నారులు


దాతల సహకారంతో సమకూర్చిన క్రీడావస్తువులు

- **చదువుకున్న పాఠశాలకు సాయం**
- **ఎల్లమ్మతండా పాఠశాల అభివృద్ధికి చందాలు**
- **మౌలిక వసతుల కల్పన**

మంచాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పూర్వవిద్యార్థుల కృషితో రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధి ఎల్లమ్మతండా ప్రభుత్వ పాఠశాల పూర్వవైభవం సంతరించుకుంటోంది. గ్రామంలోని పిల్లలంతా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలో 1 నుంచి 7వ తరగతి వరకు గల ఈ పాఠశాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చారు. ముందుగా గ్రామానికి చెందిన రవీందర్‌నాయక్ తన సొంత ఖర్చులతో పాఠశాలకు రంగులు వేయించాడు. ఆ తర్వాత తోటి స్నేహితులు సపావట్ హరికృష్ణ, శ్రీనివాస్‌నాయక్‌ల సహకారంతో రూ.2లక్షలకు పైగా వెచ్చించి బడికి వాల్‌పెయింటింగ్స్ వేయించడంతో పాటు మూత్రశాలలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించారు. వీరంతా ఇక్కడి పాఠశాలలో చదువుకుని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందినవారు కావడం విశేషం.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ హునానాయక్, మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మమల్లేష్, మాజీ సర్పంచ్ జగదీష్, బాలూనాయక్, ఎస్.రాజ్‌కుమార్‌లను ఓ ప్రణాళికతో గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇంకా ప్రైవేటు పాఠశాలలకు చెందిన స్కూల్ వ్యాన్‌లు ఊరిలోకి రాకుండా కట్టడి చేశారు. వీరందరి సహకారంతో ఎల్లమ్మతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 66కు చేరుకుంది. దాతల సహకారంతో పాఠశాలలో విద్యావలంటీర్లను నియమించి ఆంగ్లమాధ్యమం బోధిస్తున్నారు. ఇటీవల దాతలు నాయినంపల్లి రవి, మాలతిలు తమ స్వచ్ఛంద సంస్థ తరఫున క్రీడాసామగ్రిని అందజేశారు.

సొంత ఊరికి ఏదైనా చేయాలని..



నేను పుట్టిపెరిగిన గ్రామంలోని పాఠశాల మూతబడే పరిస్థితికి రావడం కలిచివేసింది. సొంతఊరి కోసం ఏదైనా చేయాలనుకున్న. అదే పాఠశాలకు చేస్తే బాగుంటుందని సేవా కార్యక్రమాలను మొదలుపెట్టా. స్నేహితులు తోడు రావడంతో విరాళాలు వేసుకుని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాం. ఇంకా గ్రామపెద్దల సహకారంతో తల్లిదండ్రులను కలిసి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం.

- రవీందర్, పూర్వవిద్యార్థి, ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ కళాశాలలో..


వికారాబాద్: తనకు పాఠాలు బోధించిన గురువును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



మేడ్చల్ టౌన్: మాట్లాడుతున్న సీఎంఆర్ కళాశాల కార్యదర్శి సీహెచ్ శ్రీశైలంరెడ్డి


పరిగిలో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కొడంగల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో, లయన్స్‌క్లబ్ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షే మ గురుకుల ఆర్మీ డిగ్రీకళాశాలలో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, అధ్యాపకులు రూప, స్రవంతి, పావని, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వికారాబాద్: విద్యాబుద్ధులు నేర్పిన గురువును మర్చిపోవద్దని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తనకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు వీరయ్య, రాములు, కడియాల నర్సింలు, వియ్‌రాజ్‌ల ఇండ్ల వద్దకు వెళ్లి వారిని సన్మానించి పాదాభివందనం చేశారు.

పరిగి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిగిలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఉన్న స్వర్గీయ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి తపస్ సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేంద్రబహదూర్, సాయిబాబా, లక్ష్మణ్, రమేశ్, గోపాల్, చంద్రమౌళి, ప్రసాద్ పాల్గొన్నారు.

కొడంగల్: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని ఎంఈవో రాంరెడ్డి, లయన్స్‌క్లబ్ దాసప్పయాదవ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు శంకరప్ప, కరుణాకర్, గోవింద్, మోహన్, రాజు, సోమురాజు, శివకుమార్, బద్రయ్యను సన్మానించారు.

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి సీహెచ్. శ్రీశైలం రెడ్డి కళాశాలలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన అధ్యాపకులకు సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీ.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

100 మంది ఉపాధ్యాయులకు సన్మానం


వికారాబాద్: ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వైశ్య ఉపాధ్యాయులకు సన్మానం

వికారాబాద్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య ఉపాధ్యాయులను సన్మానించారు. వికారాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలోని 100మంది వైశ్య ఉపాధ్యాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైద్య సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కం శివకుమార్, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాలె లక్ష్మణ్‌గుప్తా, యాస్కి. సునిల్‌కుమార్ గుప్తా, ఆకారపు రాజగుప్తా, కృష్ణకుమార్‌గుప్తా, గంప శ్రీరాములు, సోమ రమేష్‌కుమార్, సరాపు శ్రీనివాస్‌గుప్తా, రాకేష్‌గుప్తా, శిరీష, మేఘమాల, లక్ష్మీ, యాస్కి సువర్ణ, మమత, మధుసన్, మధుసూదన్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

జీఎస్టీ తగ్గింపుతో దేశప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని భారీగా తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.


వికారాబాద్: మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వడ్లనందు, శిరీష, మాధవరెడ్డి, తదితరులు


ఘట్‌కేసర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు


పరిగిలో ప్రదాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


హకీంపేట్‌లో ప్రదాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

పేదల పెన్నిధి మాణిక్‌రావు


మాణిక్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


తాండూరులో మాజీ మంత్రి మాణిక్‌రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

తాండూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహానేత మాజీ మంత్రి మాణిక్‌రావు పేదల పెన్నిధని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం మాణిక్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాణిక్‌రావు కలలు కన్న తాండూరు అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళి గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శంకరప్ప, సతీష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని మాణిక్‌రావు విగ్రహానికి ఆయన తనయుడు, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు ఎం.రమేష్ నివాళులర్పించారు. అదేవిధంగా బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి షకుర్, తాండూరు పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు కరుణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నకిలీ ఫోన్‌పే యాప్‌తో బురిడీ

దోమ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదాపూర్ గ్రామంలోని శివ పాలకేంద్రంలో నకిలీ ఫోన్‌పే యాప్‌తో కేటుగాళ్లు బురిడీ కొట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నంబర్ ప్లేట్ లేని హోండా షైన్ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు శుక్రవారం దాదాపూర్‌లోని పాలకేంద్రానికి వచ్చి రూ.2వేలు విలువ గల సామగ్రి తీసుకున్నారు. డబ్బులు ఫోన్‌పే ద్వారా స్కాన్ చేశారు. స్కాన్‌లో సక్సెస్ అని రావడంతో డబ్బులు జమయ్యాయని నిర్వాహకులు భావించారు. కానీ స్కాన్ చేసిన డబ్బు అకౌంట్‌లో జమ కాకపోవడంతో నకిలీ ఫోన్‌పేతో మోసపోయినట్లు గుర్తించారు. పాల కేంద్రానికి వచ్చిన వ్యక్తులు సీసీ కెమెరాలో రికార్డు అయ్యారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులను పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు, స్థానికులు కోరారు. అదేవిధంగా దోమ మండలంలో మేకల దొంగతనాలు, ఇలాంటి ఫోన్‌పే మోసాలు పెరుగుతున్నా కేటుగాళ్లను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

డీజే వాహనం సీజ్.. నిర్వాహకులపై కేసు


పోలీసులు సీజ్ చేసిన డీజే వాహనం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా డీజే నడిపిస్తున్న ఇద్దరితో పాటు డీజే నిర్వహకులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఈడబ్ల్యుఎస్ కాలనీలో గణేష్ మండపం వద్ద అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసినట్లు విషయం తెలుసుకున్న పోలీసులు డీజే నిర్వహకులు తిరుపతి, గణేష్, డీజే ఆపరేటర్ ధీరజ్‌ను అరెస్టు చేసి, వాహనాన్ని సీజ్‌చేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, ప్యాడ్‌బ్యాండ్ ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

కాంగ్రెస్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీతో మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్

చౌడాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి వెంకటాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షుడిగా నేనావత్ మోహన్, ప్రధాన కార్యదర్శిగా చుక్కయ్య, కార్యదర్శులుగా హనుమంతు, గోపాల్, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా శ్రీను, ఉపాధ్యక్షుడిగా నేనావత్ లింగ్యా నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, మహిళా అధ్యక్షురాలిగా నేనావత్ వాలీబాయిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాం నాయక్, నాగరాజు, నర్సింహానాయక్, సలీమ్, వెంకటయ్యగౌడ్, శేఖర్, రాజేందర్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు కరెంట్‌రాములు

కొడంగల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందించారు. వెంకటయ్యగౌడ్ రూ.1లక్ష 11వేలు, బీజేపీ సీనియర్ నాయకులు కరెంట్ రాములు రూ.55,555, ఉపాధ్యాయుడు బాకారం చంద్రశేఖర్ రూ.51వేలు, జీ.చంద్రశేఖర్, రమేశ్, రాజ్‌కుమార్ తమవంతు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవీందర్‌యాదవ్, డీలర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వికారాబాద్ పట్టణంలో మైనార్టీలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొనగా వారిని మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

కొడంగల్: కొడంగల్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మసీదులలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మక్కా మసీద్‌లో నిర్వహించిన నాతే షరీఫ్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు మైనారిటీ నాయకులు బహుమతులు అందజేశారు.

కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఘనాపూర్‌లోని గౌడసంఘంలో ఎన్నికల అధికారి సిద్ది రామేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా వేముల పరమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా వేముల రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మండల రమేష్‌గౌడ్, డైరెక్టర్లుగా వేముల లలిత, పద్మ, శంకర్ గౌడ్, వేముల హేమంత్‌గౌడ్, కీస రాజేశ్వర్‌గౌడ్, సలహాదారులుగా వేముల గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఘనాపూర్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం


హకీంపేట్ చౌరస్తాలో అమర్చిన సీసీ కెమెరాలు

దుద్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడతాయని దుద్యాల ఎస్ఐ యాదగిరి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లగచర్లలో యుగేందర్‌రెడ్డి, హకీంపేట్‌లో శ్రీనివాస్‌రెడ్డిల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బీటీ రోడ్లకు గ్రహణం!

(ఐదో పేజీ తరువాయి)

ఉండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు, అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయని సంతోష పడాలో, పనులు పూర్తి కాలేదోనని బాధపడాలో తాండూరు ప్రాంత ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది.

నిలిచిన రోడ్ల నిర్మాణ పనులు ఇలా..

- ప్లాన్ గ్రాంట్ కింద మహబూబ్‌నగర్ రోడ్డు మార్గంలోని 4కి.మీ రోడ్డులో చిలుక వాగు బ్రిడ్జి నిర్మాణ రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో బ్రిడ్జి వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- తాండూరు - అంతారం ఫోర్ లైన్ రోడ్డు పనులకు రూ.15కోట్ల వ్యయంతో పనులు డిసెంబర్ మాసం నాటికి పూర్తి చేయాల్సి ఉండగా ఒకవైపు బీటీ పూర్తి చేసి మరోవైపు పనులు ప్రారంభించకుండా గాలికి వదిలేశారు. విద్యుత్ స్తంభాలను తొలగించని కారణంగానే పనులు నిలిచాయని కాంట్రాక్టర్ చెబుతున్నప్పటికీ స్తంభాలు తొలగించేందుకు గాను సూపర్‌విజన్ చార్జీలు చెల్లించక పోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.
- రూ. 2.38కోట్లతో బెల్కటూర్ వంతెన పూర్తి చేసినా.. అప్రోచ్ రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదు.
- తాండూరు - వికారాబాద్ రోడ్డు నిర్మాణానికి రూ.101 కోట్ల వ్యయంతో ఎంఎంఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది. ఆ కంపెనీ నుంచి పలువురు సబ్ కంట్రాక్టర్లు ఈ పనులు దక్కించుకొని నిర్మాణ పనులను గాలికి వదిలేశారు.
- ఖాంజాపూర్ - కందనెల్లి వరకు బీటీ రోడ్డు కోసం ఉన్న రోడ్డును తవ్వి కంకర పరిచి వదిలేశారు.
- తాండూరు - కోట్‌పల్లి రోడ్డు మార్గంలోని అంతారం - పెద్దేముల్ 9కి.మీ రోడ్డు రెన్యూవల్ రెన్యూవల్ కోసం రూ.8 కోట్లు మంజూరయ్యాయి. డిసెంబర్ వరకు పనులు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కనీసం ప్రారంభించని పరిస్థితి.
- ప్లాన్ గ్రాంట్ కింద అగ్గనూర్ - బషీరాబాద్, బషీరాబాద్ - మైల్వార్‌కు బీటీ, సీసీ రోడ్డు రోడ్డు నిర్మాణానికి రూ. 153 కోట్లు మంజూరయ్యాయి. అయినా పనుల్లో ఏమాత్రం వేగం పెంచడం లేదు. కేవలం రూ.2 - 3 కోట్ల విలువైన మేరకు పనులు చేపట్టారు.
- బషీరాబాద్ - కరన్‌కోట్ డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ. 30 కోట్లు మంజూరైనా పనులు సాగడం లేదు. స్వయంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెళ్లి సత్వరం పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినా పట్టించుకున్న పాపాన పోని పరిస్థితి.
- నాన్‌ప్లాన్ కింద జిన్‌గుర్తి - తట్టేపల్లికి రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టే 4కి.మి రోడ్డు అగ్రిమెంట్ గడువు పూర్తియినా పనులు పూర్తి కాలేదు. అటవీ శాఖ భూమి వివాదం ఉన్న కారణంగా పనులు ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నప్పటికీ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు.
- తాండూరు పట్టణం బస్టాండ్ నుంచి సెయింట్ మార్క్స్ హైస్కూల్ వరకు 4కి.మీ. బీటీ రోడ్డును నాలుగు లేన్లుగా మార్చేందుకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.2 కోట్ల మేరకు మాత్రమే పనులు పూర్తి చేశారు.
- గౌతాపూర్ నుంచి కరన్‌కోట్ వరకు 5కి.మీ రోడ్డు కోసం రూ.8 కోట్లు మంజూరు కాగా అగ్రిమెంట్ గడువు పూర్తయినా పనులు పూర్తి కాలేదు.


ఒకవైపు మాత్రమే పూర్తయిన అంతారం- పెద్దేముల్ రోడ్డు

కాంట్రాక్టర్ల ఆలసత్వం వల్లే..



కాంట్రాక్టర్‌ల ఆసలత్వం కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి. తక్షణమే పనులు చేయించాలని త్వరలో వారితో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలు ఇస్తాం. ఇప్పటికే రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.400 కోట్ల వరకు నిధులు తీసుకొచ్చాం. కొన్ని పనులు రాయలసీమకు చెందిన కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకొని పనులు చేపడుతున్నారు. అగ్గనూరు, మైల్వార్ రోడ్డుకు రూ.150 కోట్లు మంజూరు కాగా, ఆ పనులు కొనసాగుతున్నాయి. **- మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు**

వికారాబాద్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు



తాండూరు- వికారాబాద్ రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేయలేదు. ఖాంజాపూర్ నుంచి కందనెల్లి వరకు ఉన్న రోడ్డును తవ్వి వాటిపై కంకరవేసి వదిలేశారు. దీంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. కంకరకు తోడు దుమ్ము, ధూళి కూడా విపరీతంగా వస్తుండటంతో రాకపోకలకు అవస్థలు తప్పడంలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు.
- మధుసూధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కందనెల్లి

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి



కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ చేస్తున్న వైద్యులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేయించాలని అధికారులు సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కమ్యూనిటీ హాలులో శుక్రవారం కుక్కలకు టీకాలు వేయడానికి యాంటీ రేబిస్ క్యాంపును నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, బ్లూక్రాస్ సంస్థవారు కలిసి సంయుక్తంగా ఈ క్యాంపును నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో కుక్కలను పెంచే వారు కుక్కలకు వ్యాక్సిన్ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్ గోపాల్, మేనేజర్ సీహెచ్.శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో రేషన్ డీలర్ మృతి


మల్లికార్జున్(ఫైల్)

ధారూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగసమందర్ రేషన్ డీలర్ ముతికే మల్లికార్జున్(57) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన 1984 నుంచి రేషన్ డీలర్‌గా పని చేస్తున్నాడు. కాగా వెన్నముక, నరాల రుగ్మతతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా


పైపులైన్ లీకేజీతో వృథాగా వెళ్తున్న తాగునీరు

దుద్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లి శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం ముందు భాగంగా పైపు లైన్ లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. గ్రామస్తులకు తాగునీటిని అందించే బోరు మోటార్ నుంచి వచ్చే తాగునీటి పైపులైన్ లీకేజీ కావడంతో కొద్ది రోజులుగా తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

(ఐదో పేజీ తరువాయి)


ఏర్పాట్లను పరిశీలిస్తున్న వికారాబాద్ కమిషనర్ జాకీర్ అహ్మద్

అధికారులు 17 చెరువులను ఎంపిక చేసి అక్కడ ఏర్పాట్లు చేశారు. నిమజ్జనంలో భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల వసతులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. శుక్రవారం పెద్ద ఎత్తున వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ చెరువు వద్ద రెండు క్రేన్లు, గత ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అలాగే లైటింగ్, తాగునీటి వసతి, వైద్య సౌకర్యం వంటి వసతులను కల్పించారు. ఆయా మున్సిపాల్టీల్లోని చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్‌లకు కలెక్టర్ బాధ్యతలను అప్పగించారు. జిల్లాలో దాదాపు 38,775 వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో దాదాపు 10 వేల విగ్రహాల వరకు ఇప్పటికే నిమజ్జనం చేశారు. మిగిలిన విగ్రహాలను నేడు భక్తులు నిమజ్జనానికి తరలించనున్నారు.

లంబోదరుడి లడ్డూవేలం

వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో శుక్రవారం వినాయక నమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వినాయక మండపాల్లో లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొని అధిక ధరకు గణేశ్ లడ్డూను కైవసం చేసుకున్నారు.


ఘట్‌కేసర్: ఆర్‌కే శివాజీ వినాయకుడి లడ్డూను రూ.2.50లక్షలకు దక్కించుకున్న సుభాష్


పూడూరు: తిర్మాలాపూర్‌లో వేలంలో రూ.1,52,700లకు గణేశ్ లడ్డూను దక్కించుకున్న గోపాల్


తాండూరు: హనుమాన్ మందిర్ వినాయక లడ్డూను రూ.2.25లక్షలకు కైవసం చేసుకున్న మాజీ జీడ్పీటీసీ ధారాసింగ్